# నిండ మునిగిండ్రు

కోసల రాజ్జెంకు చంద్రసేనుడు రాజు. గాయినకు నలుగురు కొడుకులున్నరు. గాల్లు బడికి బోయి సదువుకునేటోల్లు గాదు. ఎప్పుడు అందరితోని కొట్లాడెటోల్లు. కొడుకులను జూసి రాజు ఫికర్‌బడబట్టిండు. ఎట్ల జేస్తె గీల్లు సుద్రాయిస్తరని ఒక్క తీర్గ ఆలోచన జెయ్యబట్టిండు.

ఒక దినం రాజు కొడుకుల గురించి ఫికర్ బడుతుండంగ మంత్రి సూసిండు.

"రాజా! మీరెందుకు ఫికర్ బడుతున్నరు?" అని అడిగిండు.

"నా కొడుకులు బాగ్గావాలంటె ఏం జెయ్యాలెనో సమజైతలేదు" అని రాజు అన్నడు.

"గీయింత దాన్కి ఫికర్ బడితె ఎట్ల. మన రాజ్జెంల ఉత్తరం దిక్కు ఉన్న అడ్వీల రామశర్మ అనేటి పంతులు ఉన్నడు. గాయిన మంచిగ సద్వు జెప్తడు. గాయినతాన్కి మీ కొడ్కులను తోలిస్తె మంచిగుంటది" అని మంత్రి అన్నడు.

"మా పోరగాల్లు సదుకోమని జెప్తె ఇంటలేరు"అని రాజు అన్నడు.

"రామశర్మ అందరి లెక్క సదువు జెప్పడు. గాయిన సదువు జెప్పేటి తరీక అల గుంటది. గాయిన కతలతోని సదువు జెప్తడు. కతలంటె ఎవ్వలికి ఇష్టముండదు" అని మంత్రి అన్నడు.

మంత్రి మాట మీద రాజు, రామశర్మను బిలిపిచ్చిండు.

"రాజా! నన్నెందుకు బిలిపిచ్చిండ్రు?" అని రామశర్మ అడిగిండు.

"మా కొడుకులకు మీరు సద్వుజెప్పాలె" అని రాజు అన్నడు.

"మీ కొడుకులను నాతోని మా ఆశ్రమాని కి దీస్కబోత. గాడనే సద్వుజెప్త" అని రామశర్మ అన్నడు.

"మంచిది గట్లే గానియ్యుండ్రి" అని రాజు అన్నడు.

రాజు కొడుకులను దీస్కోని రామశర్మ అడ్వీల ఉన్న ఆశ్రమానికి బోయిండు. దినం పూట రాజు కొడుకులు చెట్లు ఎక్కి ఆడుకున్నరు. రాత్రి తిన్నంక పండుకునే ముంగట రామశర్మ గాల్లతాన్కి వొచ్చిండు.

"మీ కొక కత జెప్త ఇనుండ్రి" అన్నడు.

"కతైతె జెప్పుండ్రి" అని రాజు కొడుకులు అన్నరు.

రాజకీయాలల్ల ఒకటి జెప్తరు.

ఇంకోటి జేస్తరు. మందిని ముంచుతరు. మంత్రులైతరు. గదెట్లనో మీకు ఎర్కజేసెతందుకే గీ కత జెప్తున్న ఇనుండ్రి. గది శీకటి రాజ్జెం. గా రాజ్జెంల ఐదేండ్ల కొక పారి ఎలచ్చన్లు అయితయి. గా రాజ్జెంల విజయసేనుడు అనేటి సిన్మ యాక్టర్ ఉన్నడు. గాయిన రాజకీయాల్ల షరీ కవుదామనుకున్నడు. ఏదన్న ఒక పార్టీల గలువుడుకంటె కొత్త పార్టి బెడ్తె బాగుంటదనుకున్నడు. కొత్త పార్టి బెడ్తనని అందరితోని జెప్పబట్టిండు. విజయసేనుడు కొత్త పార్టి బెడితె గా దాంట్ల షరీకయ్యేతందుకు మస్తు మంది ముంగట్కి రాబట్టిండ్రు. ఒగాయిన విజయసేనుడి పెండ్లాంను గల్సిండు. గల్సి -

"నీ మొగడు బెట్టేటి పార్టీల నేను షరీకైత. నాకు ఎమ్మెల్యే టికిట్ వొచ్చేటట్టు జెయ్యి" అని అన్నడు.

"నీకు ఎమ్మెల్యే టికిట్ వొచ్చేటట్లు జేస్తె నా కేమొస్తది" అని విజయసేనుడి పెండ్లాం అడిగింది.

"నీకు రవ్వల వొడ్డానం జేపిస్త" అని గాయిన అన్నడు.

అనుడే గాకుంట గాయిన గామెకు రవ్వల వొడ్డానం జేపిచ్చిండు.

ఇంకొకాయిన విజసేనుడి మామను గలిసిండు.

"మీ అల్లుడు బెట్టేటి పార్టీల నేను షరీకైత. నాకు ఎమ్మెల్యే టికిట్ వొచ్చేటట్లు జెయ్యుండ్రి" అని అన్నడు.

"జేస్త గని నాకు పట్నంల ఒక బంగ్ల గట్టిచ్చి ఇస్తవా?" అని విజయసేనుడి మామ అడిగిండు.

"తప్పకుంట గట్టిచ్చి ఇస్త" అని గాయిన అన్నడు.

మాట ఇచ్చిన తీర్గనే గాయిన విజయసేనుడి మామకు పట్నంల బంగ్ల గట్టిపిచ్చి ఇచ్చిండు.

ఇంకొకాయిన విజయసేనుడి తమ్మున్ని తాన్కి బోయిండు.

"మీరు నాతాన్కి ఎందుకు వొచ్చిండ్రు. మీకు ఏం గావాలె?" అని విజయసేనుడి తమ్ముడు అడిగిండు.

"మీ అన్న కొత్త పార్టి బెడ్తున్నడని ఎర్క అయ్యింది. జెర నాకు ఎమ్మెల్యే టికిట్ వొచ్చెటట్లు జెయ్యుండ్రి" అని గాయిన అన్నడు.



"నీకు ఎమ్మెల్యే టికిట్ వొచ్చెటట్లు జేస్తె నాకేమొస్తది?" అని విజయసేనుడి తమ్ముడు అడిగిండు.

"నాకు ఎమ్మెల్యే టికిట్ వొచ్చెటట్లు జేస్తిరా అంటె మీకు రెండెక్రాల జాగ ఇస్త" అని గాయిన అన్నడు.

అనుడే గాకుంట విజయసేనుడి తమ్మునికి గాయిన రెండెక్రాల జాగ ఇచ్చిండు.

విజయసేనుడు కొత్త పార్టి బెడ్తున్నడని అందరికి ఎర్క అయినట్లే రూలింగ్ పార్టీకి గూడ ఎర్క అయ్యింది. కొత్త పార్టి గిన వొస్తె ఓట్లు జీల్తయి. ఓట్లు జీల్లె సీట్లు తక్వ అయితయి. విజయసేనుడిని మన దిక్కు మల్పుకుంటె బాగుంటదని రూలింగ్‌పార్టి లీడర్లు అనుకున్నరు. అనుకునుడే గాకుంట గాయిన తాన్కి బోయిండ్రు.

"ఏంది గిట్లొచ్చిండ్రు?" అని విజయసేనుడు గాల్లను అడిగిండు.

"మీరు కొత్తపార్టి బెడ్తె పాయిదేమున్నది?" అని గాల్లు అన్నరు.

"కొత్తపార్టి బెట్టకుంటె ఏం జెయ్యమంటరు?" అని విజయసేనుడు అడిగిండు.

**సింగిల్ పేజి కథ**

"మా పార్టీల షరీకవ్వుండ్రి" అని గాల్లన్నరు.

"మీ పార్టీల షరీకైతె లాబమేంది?" అని విజయసేనుడు అడిగిండు.

"మా పార్టీల షరీకైతె మీకు ఎమ్మెల్యే టికిట్ దొర్కుతది. ఎలచ్చన్ల మీరు గెల్సెటట్లు జూస్తం. గంతే గాకుంట మిమ్ములను మంత్రిని గూడ జేస్తం" అని గాల్లన్నరు.

విజయసేనుడు రూలింగ్ పార్టీల షరీకయ్యిండు.

ఎలచ్చన్ల గెల్సిండు.

మంత్రి గూడ అయ్యిండు. గని గాయిన కొత్త పార్టి బెడ్తదనుకోని ఎమ్మెల్యే టికిట్ల కోసం కోషిస్‌జేసినోల్లే నిండమునిగిండ్రు అని రామశర్మ రాజు కొడుకులకు కత జెప్పిండు.

— తెలిదేవర భానుమూర్తి